క్లుప్తంగా

'పీఎం సూర్యఘర్'పై అవగాహన



కొండవెలగాడలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ గ్రామంలో పీఎం సూర్యఘర్ యోజనపై విద్యుత్ అధికారులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆ శాఖ డిప్యూటీ డీఈఈ భీమరాజు, ఏఈ పిచ్చయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాయితీపై సోలార్ రూఫ్ టాప్‌లను అందిస్తోందని, పథకాన్ని వినియోగించుకొని విద్యుత్ ఖర్చులు తగ్గించుకోవాలన్నారు. సౌరశక్తి వాడకం వలన లభించే ప్రయోజనాలు, ఉచిత సబ్సిడీ వివరాలు, దరఖాస్తు చేసుకునే విధానాన్ని ప్రజలకు అధికారులు వివరించారు. పర్యావరణ పరిరక్షణకు సౌర శక్తి తోడ్పడుతుందని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ



కొండగుంపాంలో సరస్వతీ దేవి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండగుంపాం ప్రాథమిక పాఠశాలలో సరస్వతీ దేవి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు సూర్యనారాయణమూర్తి, జ్ఞానశంకర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో విద్యా దేవత సరస్వతీ దేవి విగ్రహం ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విగ్రహాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని కోరారు. అమ్మవారి కరుణతో విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో దాత పతివాడ గోవిందరావు, హెచ్ఎంలు శ్రీనివాసరావు, త్రినాథ్, సిబ్బంది అప్పలస్వామి, సత్తిబాబు, శ్రీలత, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థుల అభ్యున్నతికి కృషి



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న రోటరీ ప్రతినిధులు

విజయగనరం: విద్యార్థుల అభ్యున్నతికి రోటరీ క్లబ్ నిరంతరం కృషి చేస్తుందని విజయనగరం రోటరీ సెంటర్ క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అగర్వాల్ పేర్కొన్నారు. రోటరీ సెంట్రల్ క్లబ్ నిర్వహిస్తున్న నవతరోత్సవాలలో భాగంగా శుక్రవారం పట్టణంలోని కేఎల్ పురంలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, జామెట్రీ బాక్స్‌లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ రోటరీ నిర్వహిస్తున్న నవతరోత్సవాల పోటీలకు పాఠశాలల నుంచి చక్కని స్పందన లభిస్తుందన్నారు. ఈ పోటీలలో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులు ఈ నెల 30న ముగింపు కార్యక్రమంలో అందజేయడం జరుగుతుందన్నారు. నోట్స్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో రోటరీ సెంట్రల్ క్లబ్ కార్యదర్శి ఉదయ్, ఆర్.శంకర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సుహాసిని, మైలపిల్లి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సలహాలతోనే మందులు వాడాలి

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ దేవి మాధవి

విజయనగరం ఫోర్ట్: వైద్యుల సలహా మేరకు మాత్రమే మందులు వాడాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దేవి మాధవి అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాలు సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విచక్షణ రహితంగా మందులు వాడడం వల్ల సైడ్ ఎఫెక్ట్స్ వచ్చే అవకాశం ఉందన్నారు. అదే విధంగా సొంతంగా మందులు కొనుగోలు చేసి వాడకూడదన్నారు. ఎటువంటి పక్క ప్రభావాలు గమనించినా వెంటనే వైద్యులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పీఏ రమణి, డెర్మటాలజీ హెచ్‌వోడీ డాక్టర్ వెంకటాచలం, ఎనస్తీషియా హెచ్‌వోడీ డాక్టర్ జయధీర్ బాబు, డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్, సీనియర్ ఫార్మసీ అధికారి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పూర్తి

- ఇక ఆన్‌లైన్‌లో రైతుల లావాదేవీలు
- డీసీసీబీలో తగ్గిన రుణాలపై వడ్డీ రేటు



పూసపాటిరేగ డీసీసీబీ బ్రాంచి

పూసపాటిరేగ : అన్నదాతలకు ఆర్థిక తోడ్పాటు అందించడంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు పాత్ర కీలకం. అంతటి ప్రాధాన్యత కలిగిన సహకార సంఘాలను బలోపేతం చేసి సేవలను మరింత సులభతరం చేయడానికి కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ఆదేశాలతో కంప్యూటరీకరణ పూర్తి చేశారు. సహకార సంఘాలలో బినామీలు, తప్పుడు పత్రాలతో రుణాలు తీసుకోవడం వంటి పొరపాట్లుకు ఇకపై చెక్ పడనుంది. పూసపాటిరేగ డీసీసీబీ బ్రాంచి పరిధిలో సుమారు 15 వేల మంది రైతులు వివరాలు కంప్యూటరీకరణ అయ్యాయి. ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలలో రైతులు వివరాలు కంప్యూటరీకరణ ద్వారా మెరుగైన సేవలు అందించనున్నారు. పీఏసీఎస్‌లను నాబార్డు సాఫ్ట్‌వేర్ ద్వారా డీసీసీబీలకు జాతీయ నెట్‌వర్కు అనుసంధానం చేసే విధంగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ చర్యలు చేపట్టింది. సొసైటీలలో నమోదైన ప్రతి ఖాతాదారుడుకి కంప్యూటరైజడ్ పాసు పుస్తకం జారీ చేస్తున్నారు. దీంతో డేటాలో తప్పులు జరిగే అవకాశం వుండదు. రైతు తీసుకున్న రుణం, చెల్లిస్తున్న సొమ్ము, వడ్డీ వివరాలను ఖాతాదారులు సులువుగా తెలుసుకోవచ్చును. ప్రతి ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేస్తారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి వచ్చిన రాయితీలు రైతుల ఖాతాకు నేరుగా జమ అవుతాయి. జాతీయ బ్యాంకులు మాదిరి పీఏసీఎస్‌లలో రైతులు లావాదేవీలు చేసుకోవచ్చు. పూసపాటిరేగ డీసీసీబీ బ్రాంచి పరిధిలో 2024–25 ఖరీఫ్ సంవత్సరానికిగాను రూ.9 కోట్లు రుణాల లక్ష్యంకుగాను రూ.6 కోట్లు, 2023–24 ఖరీఫ్ సంవత్సరానికిగాను రూ.14 కోట్లు లక్ష్యం కాగా రూ.9 కోట్లు, 2022–23 ఖరీఫ్ సంవత్సరానికిగాను రూ.11.5 కోట్లు లక్ష్యం కాగా రూ.10.70 కోట్లును రైతులకు రుణాలుగా ఇచ్చారు. రుణాలకు సంబంధించి 13 శాతం వున్న వడ్డీని 12 శాతానికి తగ్గిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

సేవలు సులభతరం

పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు సేవలు సలువుగా అందనున్నాయి. కంప్యూటరీకరణ జరగడం వలన పీఏసీఎస్‌లలో వడ్డీ, చెల్లింపులు, ఖాతా వివరాలు సులువుగా తెలుసుకోవచ్చు. గతంలో మాన్యువల్‌గా వుండడంతో ఇబ్బంది పడేవారిమి. డిజిటల్ చేయడంతో పీఏసీఎస్‌లు నుంచి సులువుగా సేవలు పొందవచ్చు.

ఎం. జయరాం, రైతు, పూసపాటిరేగ

పారదర్శక సేవలు

రైతులకు సేవలు అందించడంలో కంప్యూటరీకరణతో పారదర్శకత మరింత పెరుగుతోంది. ఎటువంటి సేవలైనా గ్రామ స్థాయిలో పొందవచ్చు. ఎటువంటి పొరపాట్లు జరిగినా సులువుగా అధిగమించవచ్చు. కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ ద్వారా సహకార సంఘాలు బ్యాంకులుగా మారాయి. ఇప్పటికే డిజిటల్ సేవలు ప్రారంభమయ్యాయి.

– పైడి శ్రీలత, డీసీసీబీ బీఎం, పూసపాటిరేగ.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ పిచ్చయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో రామతీర్థం, సీతారామునిపేట, గొర్లిపేట, కొత్తపేట, సువ్వానిపేట, తుమ్మలపేట, సువ్వానిపేట, దన్నానపేట, కోరాడపేట, తంగుడుబిల్లి, ఏటీ అగ్రహారం, ఆల్తిపాలెం గ్రామాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరుకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భోగాపురంలో..

భోగాపురం: మండలంలోని సవరవిల్లి, తూడెం, ఉప్పాడపేట, కవులవాడ, రావాడ, బసవపాలెం పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

డెంకాడలో..

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ పనులు కారణంగా మండలంలోని అక్కివరం, చింతలవలస ఏపీఎస్‌పీ బెటాలియన్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలకు శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. బెటాలియన్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఏపీఎస్‌పీ బెటాలియన్, చింతలవలస గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. అక్కివరం సబ్‌స్టేషన్ పరిధిలోని గొలగాం,మాన్యం కల్లాలు,గంట్లాం ఎస్సీ కాలనీ,డి.తాళ్లవలస గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు.

నిర్ణీత వ్యవధిలో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ హరిబాబు, రమణమూర్తి

విజయనగరం: ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం యొక్క దరఖాస్తులను పరిష్కరించే దిశగా కృషి చేయాలని లైసెన్స్ టెక్నికల్ పర్సన్, ప్రణాళిక కార్యదర్శులకు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి సూచించారు. శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరంలో వారు మాట్లాడారు. అక్టోబర్ నెలతో లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం గడువు ముగుస్తున్నందున తక్షణమే నిర్దేశిత దరఖాస్తులను, సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ లే అవుట్ వివరాలను సేకరించి అవసరమైన క్రమబద్ధీకరణ చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా నగరంలో అక్రమ నిర్మాణాలను ఉపేక్షించవద్దని చెప్పారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న కట్టడాలను ప్రారంభ దశలోనే అడ్డుకోవాలని చెప్పారు. ఆయా వివరాలను ప్రతిరోజు ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. సమావేశంలో టీపీవో అప్పలరాజు, టీపీఎస్ అనిత పాల్గొన్నారు.

గో సంరక్షణలో ప్రభుత్వ వైఫల్యం



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

విజయనగరంఫోర్ట్: గోవులను రక్షించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ ఆరోపించారు. స్థానిక సమాఖ్య కార్యాలయంలో డివిజన్ గోసంరక్షణ కమిటీ సమావేశంలో ఆయన శుక్రవారం మాట్లాడారు. భారత రాజ్యాంగంలో గోవులను, పశువులను కాపాడాలని పొందుపరిచినప్పటికీ అది అమలు జరగడం లేదన్నారు. కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఆవులను చంపి వాటి మాంసాన్ని కంపెనీలకు పంపిస్తూ వీధుల్లో అమ్ముతున్నా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సత్యనారాయణ, పైడిరాజు, సంధ్య రాణి, లక్ష్మి, గౌరి పాల్గొన్నారు.

రెడ్డికంచేరులో వైద్య శిబిరం

భోగాపురం: వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు దివ్య, స్రవంతి కోరారు. మండలంలోని రెడ్డి కంచేరులో సర్పంచ్ బైరెడ్డి రమణ అధ్వర్యంలో శుక్రవారం పోలిపల్లి పీహెచ్‌సీ వైద్యులు స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ శిబిరం నిర్వహించి రోగులకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌వో ప్రియాంక, గ్రామ పెద్దలు బైరెడ్డి దుర్గయ్యరెడ్డి, శీరపు వంశీరెడ్డి, దుర్గారెడ్డి, బొల్లింకల చిన్నయ్యరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా వర్మ

డెంకాడ: బీజేపీ మండల అధ్యక్షుడిగా వేజేళ్ల మణికంఠ వర్మను నియమించారు. నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్ వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రాజేష్ చేతుల మీదుగా మణికంఠ వర్మకు అందజేశారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ, ఒమ్మి గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. రిజిస్టర్లను పరిశీలించి ఎరువుల నిల్వలను సరి చూశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, పురుగుల మందులు విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో విజిలెన్స్ సీఐ సింహాచలం, ఏవో శ్రీలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ స్మారక నిధి ఆధ్వర్యంలో గాంధీ జయంతి

విజయనగరం అర్బన్: వచ్చే నెల అక్టోబర్ 2న జాతిపిత మహాత్మాగాంధీ, సమాజ సేవకులు వావిలాల గోపాలకృష్ణయ్య జయంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించనున్నట్టు ఏపీ గాంధీ స్మారక నిధి సంస్థ జిల్లా అధ్యక్షుడు రొంగలి పోతన్న తెలిపారు. స్థానిక జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు పెద్దింటి అప్పారావు, సభ్యులు డాక్టర్ ఎంవీఎస్ వెంకటరావు, బీవీ రమణ, షణ్ముఖరావు, దామోదరరావు, వీర్రాజు, కాంతారావు, తిరుపతినాయుడు, విజయ్‌కుమార్, సత్యనారాయణ, రామానుజరావు, వీఎస్ఎన్ మూర్తి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బడ్డుకొండ జన్మదిన వేడుకలు



నెల్లిమర్ల రూరల్: రామతీర్థంలో కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు చెబుతున్న చిత్రం



పూసపాటిరేగ: దివ్యాంగ పిల్లలకు భోజనాలు వడ్డిస్తున్న బడ్డుకొండ మణిదీప్ నాయుడు దంపతులు



డెంకాడ: అయినాడ జంక్షన్ వద్ద కేక్ కట్ చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు తమ్మునాయుడు, నాయకులు, కార్యకర్తలు



భోగాపురం: కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, తదితరులు



పూసపాటిరేగ: వృద్ధులకు దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



నెల్లిమర్ల: కేక్ కట్ చేస్తున్న నాయకులు

మాజీ ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నియోజకవర్గ సమన్వయకర్త బడ్డుకొండ అప్పలనాయుడు జన్మదిన వేడుకలు ఆ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రామతీర్థంలో పార్టీ మండల అధ్యక్షుడు గదల సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భారీ కేక్‌ను కట్ చేసి బడ్డుకొండకు శుభాకాంక్షలు తెలిపారు. పూతికపేటలో సర్పంచ్ లెంక మంగమ్మ, గోవింద దంపతులు నిరుపేదలకు దుస్తులు అందజేశారు. వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. భోగాపురం మండలం ఉప్పాడపేటలో బడ్డుకొండ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి 55 కేజీల భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ ప్రతినిధులు పడాల భానుప్రకాష్, పచ్చిపాల గురునాథ్ అభిమానులు పాల్గొన్నారు. పూసపాటిరేగలో పార్టీ కార్యాలయంలో బడ్డుకొండ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేశారు. వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, మహంతి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు అల్లాడ రమేష్, ఎన్.సత్యనారాణరాజు తదితరులు పాల్గొన్నారు. పూసపాటిరేగ మండలం కోనాడ జంక్షన్‌లోని క్యాంపస్ చాలెంజ్‌లో బడ్డుకొండ జన్మదిన వేడుకలు నిర్వహించారు. బడ్డుకొండ మణిదీప్ నాయుడు దంపతులు కేక్ కట్ చేశారు. అనంతరం అనాథ పిల్లలకు భోజనాలు ఏర్పాటు చేశారు. డెంకాడలో బడ్డుకొండ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద వెంకటేశ్వరస్వామి ఆలయంలో మండల పార్టీ అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. బొడ్డవలస పంచాయతీ అయినాడ జంక్షన్ వద్ద కేక్ కట్ చేశారు. దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహించారు. పినతాడివాడ సర్పంచ్ లెంక లక్ష్మణరావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు పిన్నింటి తమ్మునాయుడు, జెడ్పీటీసీ బడ్డుకొండ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. నెల్లిమర్లలో బడ్డుకొండ పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు ఆధ్వర్యంలో స్థానిక శ్రీదుర్గాదేవి ఆలయంలో బడ్డుకొండ దంపతులు పేరిట ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం చిక్కాల ఇంటివద్ద భారీ కేక్ కట్ చేశారు. జరజాపుపేటలో వైఎస్సార్ విగ్రహం వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగర పంచాయతీ వైస్ చైర్మన్‌లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి, కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్, చిక్కాల సుమతి, బూర సుజాత, జేసీఎస్ కన్వీనర్ మజ్జి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

గురజాడ సాహిత్యాన్ని డిజిటల్ రూపంలో భద్రపరచాలి



కలెక్టర్ రామసుందర్ రెడ్డికి వినతినిస్తున్న గురజాడ సమాఖ్య ప్రతినిధులు

విజయనగరం టౌన్: మహాకవి గురజాడ సాహిత్యాన్ని డిజిటల్ రూపంలో భద్రపరచాలని గురజాడ సాంస్కృతిక సమాఖ్య ప్రతినిధులు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, కాపుగంటి ప్రకాష్, డాక్టర్ ఎ.గోపాలరావు కలెక్టర్ రామసుందర రెడ్డిని శుక్రవారం కలిసి వినతినిచ్చారు. ఆయన స్వగృహంలో అమూల్యమైన గ్రంథాలు, మహాకవి వాడిన వస్తువులు ఉన్నాయన్నారు. ఈ మధ్యకాలంలో ఒక అగంతకుడు రాత్రివేళ మద్యం మత్తులో మహాకవి ఇంట్లోకి ప్రవేశించి, తలుపులు, ఫ్యాన్‌లు, బీరువాలు ధ్వంసం చేసి, పుస్తకాలను చిందరవందరంగా పడివేసిన ఘటన తెలుగు రాష్ట్రాలలో తీవ్ర అసంతృప్తికి గురి చేసిందన్నారు. గురజాడ స్మృతివనంగా తీర్చిదిద్దుతామని ప్రకటించిన మహాకవి ఇంటికి ఆనుకుని ఉన్న పక్క స్థలం నేడు బహిర్భూమిగా తయారైందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. రాత్రి వేళల్లో తగు రక్షణ కల్పించాలని కోరారు. గురజాడ జయంతిని సెప్టెంబరు 21న ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. సమాఖ్య తరఫున తమ వంతు పూర్తి సహకారం ఉంటుందన్నారు. 21న ఆదివారం సెలవు రోజు కావడంతో 20న శనివారం జిల్లాలో ఉన్న అన్ని విద్యా సంస్థలలో విద్యార్థులతో గురజాడ దేశభక్తి గీతాలాపన చేయించి, మహాకవి గురించి కొన్ని విషయాలను విద్యార్థులకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో ఈపు విజయకుమార్, గురజాడ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో పైడిమాంబ అష్టోత్తర శత నామావళి



పైడితల్లి అమ్మవారి అష్టోత్తర శత నామావళిని ఆవిష్కరణ

విజయనగరం టౌన్: మహిమాన్వితమైన శ్రీ పైడితల్లి అమ్మవారి అష్టోత్తర శత నామావళి భక్తులందరి ఇళ్లల్లో పూజలు నిర్వహించుకునేందుకు అందుబాటులో ఉండే విధంగా పైడిమాంబ అష్టోత్తర శత నామావళిని రూపకల్పన చేయడం ఎంతో ఆనందంగా ఉందని వాగ్దేవి సమారాధనం సంస్థ వ్యవస్థాపకురాలు, రాజాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి పేర్కొన్నారు. అమ్మవారి అష్టోత్తర శత నామావళిని స్వయంగా రూపకల్పన చేసి, తన స్వరంతో ఆడియో సీడీతో పాటూ, కరపత్రాలను శుక్రవారం దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, ఆలయ ఇన్‌చార్జ్ ఈవో కె.శిరీష చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. పైడితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ ఆవరణ, పైడిమాంబ దీక్షా పీఠంలో సీడీ, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అవనాపు భావన, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఎస్.అచ్చిరెడ్డి, ఆర్.సూర్యపాత్రో, అమ్మాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 10లోగా సర్వే పూర్తి చేయాలి



సర్వేలో అసిస్టెంట్ కమిషనర్ అప్పలరాజు

విజయనగరం: ప్రతి ఆస్తి పన్ను పరిధిలోకి తీసుకురావాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం నగర వ్యాప్తంగా ఇంటింటి సర్వే చేపట్టారు. విజయనగరం కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ కిల్లాన అప్పలరాజు శుక్రవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వేను పర్యవేక్షించారు. సచివాలయ కార్యదర్శులు, కార్పొరేషన్ సిబ్బంది, టీమ్‌లుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి ఆస్తి వివరాలను కొలతలను సేకరిస్తున్నారు. సచివాలయ అడ్మిన్, ఎమినిటీస్, ప్లానింగ్, ఉమెన్ ప్రొటెక్షన్, వెల్ఫేర్ కార్యదర్శులతో పాటు కార్యాలయ సిబ్బంది ఒకరు మొత్తంగా ఒక టీంగా ఏర్పడి సర్వేలో పాల్గొని ప్రజల నుంచి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి ఆస్తి పన్ను పరిధిలోకి తీసుకురావాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో ఇంటింటి సర్వే చేపట్టామన్నారు. అక్టోబర్ 10వ తేదీ లోపుగా సర్వే పూర్తి చేసి నివేదికలు సమర్పించనున్నట్టు చెప్పారు. ఇందుకోసం తమ ఇళ్ల వద్దకు వచ్చే టీం సభ్యులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ ఇంటింటి సర్వే ఆధారంగా ప్రతి ఆస్తి పన్ను పరిధిలో ఉందా.. లేదా.. అన్నది తెలుస్తుందన్నారు.

గురజాడ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి



మహకవి గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయనగరం: మహాకవి గురజాడ రచనలు ఇప్పటికే పాఠ్య పుస్తకాలలో ఉన్నాయి.. కానీ ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేరిస్తే యువతకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్ష కార్యదర్శులు సముద్రాల గురు ప్రసాద్, డాక్టర్ జక్కు రామకృష్ణ పేర్కొన్నారు. గురజాడ స్వగృహంలో సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి చేతుల మీదుగా గురజాడ అప్పారావు విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్.. అనేది శాశ్వత సత్యమని, దేశమును ప్రేమించుమన్నా.. అంటూ దేశభక్తిని ప్రబోధించిన గురజాడను మించిన దేశభక్తుడు లేడని అభివర్ణించారు. ఇటీవల వివిధ రంగాలలో పలు పురస్కారాలు సాధించిన దాసరి తిరుపతి నాయుడు, గెద్ద వరప్రసాద్‌లకు, రవీంద్ర భారతిలో కన్యాశుల్కం నాటకం ప్రదర్శించిన ఎం.సుభద్ర దేవికి నాగలక్ష్మి పతకాలను ప్రదానం చేశారు. జాతీయ స్థాయి సదస్సుకి ఎంపికైన డాక్టర్ పి.స్వప్న హైందవి, మహారాజా ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ మండపాక నాగలక్ష్మిని సమితి అధ్యక్షుడు సముద్రాల గురు ప్రసాద్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో భాగంగా సమితి ఉపాధ్యక్షుడు కాగుపాటి నారాయణమూర్తి, నంది పురస్కార గ్రహీత దాసరి తిరుపతి నాయుడు, బాడంగికి చెందిన కె.బాబూరావు, మృదు మధురమైన పద్యాలతో అలరించారు. కార్యక్రమంలో న్యాయవాది దాసరి పద్మ, గురజాడ కుటుంబీకులు ఇందిర, వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్

విజయనగరం రూరల్: ఈ నెల 17న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన చెరువు గట్టును తవ్వేస్తున్నారు కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు సంబంధిత అక్రమార్కులపై చర్యలకు సిఫార్సు చేశారు. విజయనగరం తహసీల్దార్ కూర్మనాథరావు అక్రమ తవ్వకాలపై స్పందిస్తూ మట్టిని తరలిస్తున్న వ్యక్తులపై కేసుల నమోదు చేసి చర్యలకు మైనింగ్ శాఖకు సిఫార్సు చేశామని తెలిపారు. మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూముల్లోగానీ చెరువుల్లోగానీ ఎటువంటి అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడితే తగిన చర్యలు చేపట్టి అపరాధ రుసుము వసూలు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. మండలంలో ఎక్కడైనా అక్రమ తవ్వకాలు చేపడితే స్థానిక గ్రామస్థాయి అధికారులు పర్యవేక్షణ చేసి ఉన్నతాధికారులకు తెలియపరచాలని ఆయన కోరారు.

సంక్షిప్తంగా...

డాక్యుమెంట్ రైటర్ల నిరసన

నెల్లిమర్ల: ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన లోపభూయిష్టమైన 2.0 విధానం వల్ల ప్రజలకు, దస్తావేజు లేఖర్లకు అసౌకర్యం కలుగుతోందని నెల్లిమర్ల డాక్యుమెంట్ రైటర్స్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద డాక్యుమెంట్ రైటర్స్ పెన్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్ రాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డాక్యుమెంట్ రైటర్స్ కూరాడ రాము, రఘు, దుర్గ, భాస్కరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సేవలతోనే నాయకులకు గుర్తింపు

నెల్లిమర్ల: ప్రజలకు అందించే సేవలతోనే నాయకులకు గుర్తింపు లభిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ వర్మ పేర్కొన్నారు. నియోజకవర్గ కేంద్రం నెల్లిమర్ల పట్టణంలోని ఇందిరా కాలనీలో ఏడో వార్డు కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు, కుళాయిలను రాజేష్‌వర్మ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూర్లె శ్రీధర్, మండల ప్రధాన కార్యదర్శి నల్లి బాబు, నడిపేన నారాయణమూర్తి, జనసేన పార్టీ నాయకులు అప్పికొండ రవికుమార్, రవ్వా నాని, అదపాక చిన్నారావు, పొంద్రంకి మహాలక్ష్మి పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌కు సత్కారం

విజయనగరం అర్బన్: ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ అల్లు పద్మజను కొప్పుల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కొరుపోలు సత్యారావు అభినందించారు. స్థానిక ఉడా కాలనీలోని సంఘం కార్యాలయంలో శుక్రవారం ఆమెను సంఘం ప్రతినిధులు పలువురు సత్కరించారు. జిల్లాకు బదిలీకి ముందు ఉద్దానంలోని కిడ్నీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు. కార్యక్రమంలో సంఘం జాతీయ కన్వీనర్ ఎస్.రావు, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బాలత్రిపుర సుందరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు, జామి మాజీ ఎంపీపీ గొర్లె రవి, రిటైర్డ్ ఎస్ఈ అల్లు గౌరునాయుడు, విశాఖ ఉమ్మడి జిల్లా కొప్పల వెలమ సంఘం మాజీ అధ్యక్షుడు ఎర్ర సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

సర్వజన ఆసుపత్రి